# నమస్తే తెలంగాణ
# హనుమకొండ

5 | వరంగల్, మంగళవారం 20 ఆగస్టు 2024 | HANUMAKONDA




హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్సీ సత్యవతి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, తదితరులు

## బస్సు ఆపి.. రాఖీ కట్టి..

**పండుగ వేళ ఆర్టీసీ విధుల్లో సోదరుడు**

**హైవేపై బస్సులో రాఖీ కట్టిన సోదరి**

శాయంపేట, ఆగస్టు 19 : అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముళ్ల ఆత్మీయ వేడుక రాఖీ. ప్రతి సోదరి తమ సోదరులు ఎక్కడ ఉన్నా అక్కడికి వెళ్లి రాఖీ కట్టి చల్లగా ఉండాలని ఆకాంక్షిస్తుంది. మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన ముక్క సరస్వతి సోదరుడు పోకల కృష్ణమూర్తి ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. పండుగ వేళ ఆమె సోదరుడు ఆన్ డ్యూటీలో ఉన్నాడు. ఈ క్రమంలో పరకాల, హనుమకొండ హైవేపై పెద్దకోడెపాక క్రాస్ వద్ద తమ్ముడు విధులు నిర్వర్తిస్తున్న బస్సును ఆపి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించి సోదరుడిపై ఉన్న ప్రేమను వ్యక్తం చేసింది.



ఆర్టీసీ బస్సులో తమ్ముడు కృష్ణమూర్తికి రాఖీ కడుతున్న సరస్వతి

## రాఖీ రష్..

- కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణాలు
- బస్సుల్లేక ప్రయాణికుల పాట్లు
- హనుమకొండ బస్‌స్టేషన్‌లో ఎక్కువ రద్దీ

రాఖీ పండుగ వేళ ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడగా చాలా చోట్ల ఇవే దృశ్యాలు కనిపించాయి. వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చి తిరుగు ప్రయాణమైన వారికి తిప్పలు తప్పలేదు. హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. కంపార్ట్‌మెంట్లన్నీ ప్రజలతో నిండిపోయాయి. ఓ వైపు వర్షం.. మరో వైపు ఏ బస్సు చూసినా ఫుల్ అయి వస్తుండడంతో సీట్ల కోసం పోటీపడ్డారు. రాఖీ పండుగ కోసం మూడు రోజుల నుంచి హైదరాబాద్‌కు 300 బస్సులు నడిపించామని, ఎప్పటికప్పుడు రద్దీకనుగుణంగా బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను చెప్పారు. *- హనుమకొండ చౌరస్తా*





హనుమకొండ బస్టాండ్‌లో బస్సుల కోసం పోటీ పడుతున్న ప్రయాణికులు.. రద్దీ ఉండడంతో బాలుడిని కిటికీ ద్వారా బస్సు లోపలికి పంపిస్తున్న కుటుంబసభ్యులు(ఇన్‌సెట్‌లో)



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



బస్సుల వద్ద ప్రయాణికుల రద్దీ

## కిటికీల నుంచే టికెట్ టికెట్..!

ఏటూరునాగారం, ఆగస్టు 19 : సాధారణంగా బస్సు కండక్టర్ సీట్ల వద్దకే వచ్చి ప్రయాణికులకు టికెట్లు ఇస్తారు. కానీ సోమవారం ఏటూరునాగారం బస్‌స్టేషన్‌లో వచ్చిన బస్సు వచ్చినట్లు నిండిపోతుండడంతో ఓ కండక్టర్ విధి లేక బస్సు బయటి నుంచే టికెట్ ఇవ్వాల్సి వచ్చింది. లోపలికి చొచ్చుకొని వెళ్లే సాహసం చేయలేక ఇలా బస్సు చుట్టూ తిరిగి కిటికీల నుంచే టికెట్ ఇవ్వడం కనిపించింది. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం, మంగపేట మండలాల ప్రజలకు ఏటూరునాగారం మెయిన్ సెంటర్ కావడంతో రాఖీ కట్టేందుకు వచ్చి వెళ్తున్న మహిళలతో బస్‌స్టేషన్ కిటకిటలాడింది. ప్రమాదమని తెలిసినా చేసేదేమీలేక ఒక్కో బస్సులో 150 మంది దాకా ఎక్కారు.



బస్సు కిటికీ నుంచి ప్రయాణికులకు టికెట్లు ఇస్తున్న కండక్టర్

## రుణమాఫీ పేర అప్పులైనయ్

- బ్యాంకుల డబ్బులు కట్టి, బిడ్డ పెళ్లి చేసిన..
- డబ్బులు మాఫీ కాక అన్నీ మీదపడ్డయి
- మొటికె పరమేశ్, రైతు, చినమడూరు, దేవరుప్పల మండలం



దేవరుప్పుల, ఆగస్టు 19: రుణమాఫీ దేవుడెరుగు అప్పులోళ్లు నాయింటి సుట్టు తిరుగు తుండ్రు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి మాటలు విని మోతుబరి ముఖ్యమంత్రి తెలంగాణకు వస్తుండనుకున్నం. రుణమాఫీ కాక అప్పులు నా పీకల మీదికి వచ్చి కూసున్నయ్. నాకు 10 ఎకరాల భూమి ఉంది. పత్తి, వరి పంటలు వేస్త. నా పేరు మీద రూ. 2 లక్షలు, నా భార్య వరలక్ష్మి పేర రూ. 2 లక్షలు సింగరాజుపల్లి ఏపీ గ్రామీణ వికాస బ్యాంకుల లోను తీసుకున్నం. 6 నెలల కిందనే బిడ్డ పెళ్లి చేసిన. రేవంత్‌రెడ్డి రూ. 2లక్షలు రుణ మాఫీ చేస్తడని రూ. 2 లక్షలు మిత్తికి తెచ్చిన. ఇక బ్యాంకు మేనేజర్ రెండు లక్షల లోపే బ్యాంకుల లోను ఉంటే మాఫీ అయితది, నీ భార్య పేరు మీద ఉన్న అప్పు మిత్తితో సహా కట్టమని చెప్పిండు. దీంతో రూ. 2లక్షలు వడ్డీతో సహా కట్టిన. నేను మిత్తి కట్టి రెన్యువల్ చేసుకున్న. మూడు లిస్టుల్లో చూసినా నా పేరు రాలే. అటు బిడ్డ పెండ్లికి అప్పులైనయ్. బ్యాంకు మేనేజర్ నా భార్య పేరు మీద ఉన్న అప్పు కట్టించుకున్నడు. ఇప్పుడు వానకాలం పత్తికి, వరికి పెట్టుబడికి మళ్ల సావుకార్ల దగ్గరకు పోక తప్పుతలేదు. రుణ మాఫీ లెక్క నాకు ఇప్పటికి అర్థమైత లేదు. ఎవ్వలనడిగినా ఇవరంగ చెప్పుతలేరు.

### ఇంట్ల ఒక్కరికి మాఫైనా బాగుండు



దేవరుప్పుల, ఆగస్టు 19: దేవరుప్పుల యూనియన్ బ్యాంకులో నాకు, నా భార్య పేరు మీద కలిపి రూ. 3 లక్షల రుణం తీసుకున్నం. మూడో విడత రూ. 2లక్షలు మాఫీ అవుతదని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తే నిజమేనని నిమ్మలంగ ఉన్నం. నిన్న వచ్చిన లిస్టుల పేరు లేదు. మేం రెగ్యులర్‌గా బ్యాంకుల రెన్యువల్ చేస్తం. అయినా మాఫీ కాలేదు. ఈ తిరకాసేందో ఎవరూ చెప్పుతలేరు. రేషన్‌కార్డుతోనైనా కుటుంబానికి రూ. 2లక్షలు మాఫీ చేసినా బాగుండు. సగం మంది రైతులు రుణ మాఫీ కాకుండా మిగిలి ఉండ్రు. రూ. రెండు లక్షల పైన రుణం ఉంటే మిగతాది మేం కట్టుకుంటం. అక్కడి వరకన్న మాఫీ చేయాలికద. ఎన్నికలప్పుడు నేను రాంగనే రూ. 2 లక్షలు మాఫీ చేస్తనని రేవంత్‌రెడ్డి అన్నడు. ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేయాలె.

– బూత్కూరు అశోక్‌రెడ్డి, రైతు, దేవరుప్పల

## సగం మందికే రుణమాఫీ

**డీసీసీబీ పరిధిలో 1543 మందికి 839 మంది రైతులకే..**

నర్సింహులపేట, ఆగస్టు 19: మండలవ్యాప్తంగా సగం మందికే రుణమాఫీ కావడంతో మిగిలిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పీఏసీఎస్ పరిధిలోని మరిపెడ డీసీసీ బ్యాంకులో 1542 మంది రైతులు రూ. 9,82,77,951 పంట రుణం తీసుకున్నారు. ప్రభుత్వం మూడు దఫాలుగా 839 మంది రైతులకు మాత్రమే రూ. 4,85,09, 240 మాఫీ చేసింది. మొత్తం 1542 మంది రైతుల్లో రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్నది 10 మంది రైతుల కంటే ఎక్కువ ఉండరని, అయినా 694 మందికి రుణమాఫీ జరుగకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తప్పిదంతో రుణమాఫీ జరుగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నా పేరు లిస్టులో లేదు

నేను డీసీసీ బ్యాంకులో రూ. 50 వేలు పంట రుణం తీసుకున్న. అప్పుడు బ్యాంకు వాళ్లు నాకు రూ.44 వేలిచ్చి ఆరు వేలు షేర్ అమౌంట్ అని ఉంచుకున్నరు. ఇప్పుడు ప్రభుత్వం మూడు సార్లు మాఫీ చేసినా నా పేరు రాలేదు. పీఏసీఎస్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఏమి చెప్పడం లేదు. బ్యాంకుకు పోతే అగవస్తది. ఇగవస్తది అంటున్నరు. అధికారులు నాకు రుణమాఫీ వచ్చేలా చూడాలె.

– జేరిపోతుల రమేశ్, కొమ్ములవంచ



- ఒక్కో ఊరిలో ఒక్కో తీరు సమస్య
- అన్నీ ఉన్నా వర్తించని రుణమాఫీ
- పెద్దవంగర మండలం కొరిపెల్లిలో 255కు 95 మంది రైతులకే..
- వర్ధన్నపేట మండలం గట్టికల్లులో 584కు 202
- 'నమస్తే' పరిశీలనలో వెలుగులోకి..
- ఉమ్మడి జిల్లాల్లో చాలా గ్రామాల్లో అదే పరిస్థితి



# మాఫీ కథ రైతుకు వ్యథ

**రుణం తీరక తప్పని ఎదురుచూపులు**

**సగం కంటే ఎక్కువ మంది బాధితులే**

**కొందరికేనా మాఫీ అంటూ నిలదీతలు**

**రైతుకు రుణమాఫీ రంది పట్టుకున్నది. రేవంత్ సర్కారు అందరికీ వర్తింపచేశామని ప్రకటించడంతో తమకూ మాఫీ అవుతుందిలే అని సంబురపడ్డ సగటు అన్నదాతకు ఆ ఆనందం ఎంతసేపూ నిలువలేదు. చాలా గ్రామాల్లో సగం కంటే తక్కువ మంది రైతులకే రుణం మాఫీ కావడం ఇందుకు నిదర్శనం. ఆ ఊరు.. ఈ ఊరు అనే తేడా లేకుండా ఎక్కడచూసినా మాఫీ కాని బాధితులే ఎక్కువ ఉన్నట్లు 'నమస్తే' పరిశీలనలో వెలుగులోకి వస్తున్నాయి. ఒక్కో చోట ఒక్కో తీరు సమస్య బయటపడుతుండడంతో అందరికీ మాఫీ చేసేశామని ఇప్పుడు కొందరికే చేస్తారా? తమకెందుకు మాఫీ చేయలేదంటూ నిలదీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉండగా అసలు రుణమాఫీ అయితదా.. కాదా..? అని చెప్పేవారు లేక ఆవేదన చెందుతున్నారు.**

*- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 19*



### నాకూ.. నా కొడుక్కు ఇద్దరికీ కాలే..

నాకు ఆరెకరాలు ఉంటే పెద్దవంగర బ్యాంకులో రూ.30వేలు రుణం తీసుకున్న. క్రమంగా రెన్యువల్ చేసుకుంటా పోతే ఇప్పుడు రూ.2.17లక్షలు ఉంటే ఆగస్టు 7న రూ.17వేలు కట్టి రెన్యువల్ చేసిన తర్వాత మాఫీ వస్తే రుణం తీసుకో అని బ్యాంకోళ్లు చెప్పిన్రు. అది కూడా మాఫీ కాలే. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.77వేలు మాఫీ అని మెసేజ్ వచ్చింది కానీ బ్యాంక్ ఖాతా నంబర్ వేరే ఉందని చెప్పి పట్టించుకోలే. నా కొడుక్కి 5.20 ఎకరాలు ఉంది. అతనికి రూ.2 లక్ష ల 50వేలు రుణం ఉందని చెప్పిన్రు. నాలుగు నెలల కింద రెన్యువల్ చేసిండు. ఓసారి కేసీఆర్ ప్రభుత్వంలో రూ. లక్ష మాఫీ వచ్చింది. లక్ష తీసుకున్నడు. అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాలి.

– పెరుగు యాదిరెడ్డి, కొరిపల్లి, పెద్దవంగర మండలం, మహబూబాబాద్ జిల్లా

మహబూబాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ)/పెద్దవంగర : మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం కొరిపల్లిలో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ గ్రామంలో మొత్తం 440 మంది రైతులు ఉన్నారు. ఇందులో 255మంది రుణమాఫీ తీసుకున్న వారిలో ఉన్నారు. ఇందులో మొదటి విడుతలో 25మందికి, రెండో విడతలో 30 మందికి, చివరి విడతలో 40 మందికి రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యింది. మిగిలిన 160 మంది రైతులకు ఇక్కడ రుణమాఫీ కాలేదు. కొరిపెల్లి గ్రామ రైతులందరూ పెద్దవంగర మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. ఇందులో రెన్యువల్ చేసుకున్న రైతులు చాలామంది ఉన్నారు. వారికి కూడా రుణమాఫీ కాలేదు.

ఇదే గ్రామానికి చెందిన పెరుగు యాదిరెడ్డికి ఆరు ఎకరాల భూమి ఉంది. ఆయన గత 12 ఏళ్లుగా వరుసగా పంట రుణాలు తీసుకుంటూ వస్తున్నారు. ఇతను రూ రెండు లక్షల రుణం తీసుకున్నారు. పైన మిత్తి చెల్లించి గతంలోనే రెన్యువల్ కూడా చేసుకున్నాడు. అయినప్పటికీ ఇతనికి రుణమాఫీ జాబితాలో లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సార్ రుణమాఫీ చేసినప్పుడు ఇతను తీసుకున్న రుణమాఫీ మొత్తం రూ. 77,000 ఒకేసారి మాఫీ అయిందని చెబుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన మరో రైతు మహిపాల్ రెడ్డికి ఐదున్నర ఎకరాల భూమి ఉంది.

ఇతను కూడా రెండు లక్షల రుణం అంటారు తీసుకున్నాడు. ఇతనికి కూడా రుణమాఫీ కాలేదు. గత ఏడాది టిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీలో ఇతనికి ఒకేసారి రూ. లక్ష రుణమాఫీ జరిగింది. ఇప్పుడు జరగకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. ఇదే గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలకు కూడా రుణ మాఫీ కాకపోవడంతో వారు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

### గట్టికల్లులో 584కు 202..

వర్ధన్నపేట, ఆగస్టు 19 : రైతుల పంట రుణాల విషయమై 'నమస్తే తెలంగాణ' సోమవారం రాయపర్తి మండలం గట్టికల్లు గ్రామాన్ని సందర్శించింది. ఈ గ్రామంలో 584మంది రైతులు ఉండగా వీరిలో 90శాతం రుణాలు తీసుకున్న వారున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడుతలో 110మందికి, రెండో విడుత 69మందికి, మూడో విడుత 23మందికి మాత్రమే రుణమాఫీ చేసింది. దీంతో మిగిలిన రైతులు మాఫీ కాక ఆందోళన చెందుతున్నారు. రూ.50వేల రుణాలు తీసుకున్న వారికి కూడా మాఫీ కాలేదు. చిన్న చిన్న కారణాలతో మాఫీ చేయకపోవడంతో వారు ఆవేదనకు గురవుతున్నారు.



### రూ.20వేలు కూడా మాఫీ చేయలే

నా పేరు మీద 17 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. నేను పట్టాదార్ పాస్‌పుస్తకాన్ని కొండాపురం కెనరా బ్యాంకులో తనఖా పెట్టి రూ.20వేలు మాత్రమే పంట రుణం తీసుకున్న. కానీ నాకు మొదటి దశలోనే పంట రుణమాఫీ అయ్యేదుండె. కానీ మూడు దశలు పూర్తయినా నాకు మాత్రం మాఫీ జరగలేదు. ఎందుకని అడిగితే నాకు ప్రత్యేకంగా రేషన్ కార్డు లేదని చెబుతాన్రు. కొత్త రేషన్ కార్డులు వస్తే నేను పూర్తి అర్హతతోనే కార్డు తీసుకుంట. కానీ రేషన్‌కార్డు సాకుతో నేను తీసుకున్న రుణాన్ని మాఫీ చేయకపోవడం బాధగా ఉంది. ఇది ప్రభుత్వానికి ఏమాత్రం న్యాయం కాదు. అందుకే రైతులు గీ సర్కారు మీద మస్తు కోపంగా ఉన్నరు.

– చిన్నాల రాజుయాదవ్, రైతు, గట్టికల్లు

## నువ్వు దూరమైనా నీ జ్ఞాపకానికి రక్ష

**తమ్ముడి బైక్‌కు రాఖీ కట్టిన అక్క**



కేసముద్రం, ఆగస్టు 19 : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తీగలవేణి గ్రామానికి చెందిన బానోత్ తేజు– భద్రమ్మ దంపతులకు ఒక కుమారుడు రాజు, కుమార్తె శ్రీలత ఉన్నారు. రాజు ఇటీవల మృతిచెందగా, అతడి అక్క శ్రీలత భర్త ప్రశాంత్ రాజు ద్విచక్రవాహనాన్ని వినియోగిస్తున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా కేసముద్రం మండలం బేరువాడ గ్రామంలో తన తమ్ముడిని గుర్తు చేసుకుంటూ ద్విచక్రవాహనానికి రాఖీ కట్టి కన్నీటి పర్యంతమైంది.

## నమస్తే ఫొటోగ్రాఫర్‌కు అవార్డు




అవార్డు అందుకుంటున్న ఫొటోగ్రాఫర్ మేరుగు ప్రతాప్



అవార్డు వచ్చిన ఫొటో ఇదే..

**ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ బేగంపేట గ్రీన్‌పార్క్‌హోటల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు చేతులమీదుగా నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్ మేరుగు ప్రతాప్ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం మండల కేంద్రంలో గృహజ్యోతి పథకంలో భాగంగా వృద్ధురాలు కరెంట్ స్విచ్ ఆన్ చేయగా, విద్యుత్ బల్బ్ వెలుగులో చదువుకుంటున్న విద్యార్థుల ఫొటో తీసిన ప్రతాప్‌ను ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డును సోమవారం ప్రతాప్‌కు అందజేసింది.**

*- గిర్మాజీపేట, ఆగస్టు 19*

### ● ఆటోవాలీ.. స్నేహ

పరిస్థితులే మనుషులకు అన్నీ నేర్పిస్తాయి. పొట్టకూటి కోసం అసాధారణ వృత్తినీ ఎంచుకోవాల్సి వస్తుంది. ఈ కోవలోకే వస్తుంది వరంగల్ శివనగర్‌కు చెందిన స్నేహ. కుటుంబపోషణ కోసం వరంగల్ నుంచి కాజీపేటకు ఆటో నడుపుతున్నది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



## మొన్న 9,506.. ఇప్పుడు 6,676

- రుణమాఫీపై అంతుచిక్కని వివరాలు
- ఇప్పటికీ విడుదల కాని రైతుల జాబితా

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 19 : రుణమాఫీ విషయంలో సర్కారు రోజుకో తీరున లెక్కలు మార్చి అన్నదాతలను ఆందోళనను గురిచేస్తున్నది. రైతులు ఒకవైపు తమ వ్యవసాయ రుణం మాఫీ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తుండగా ప్రభుత్వం మాత్రం నిత్యం చాలామందికి ఎగనామం పెట్టాలనే యోచనలో ఉన్నట్లు మారుతున్న గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. మూడో విడతలో హనుమకొండ జిల్లాలో 9506 మందికి రెండు లక్షల మేరకు రుణమాఫీ అయినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు విడుదల చేసింది. రూ.122.40 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. అయితే మొదటి, రెండో దఫాల మాదిరి రైతు వారీగా జాబితాను విడుదల మాత్రం చేయలేదు. ముఖ్యమంత్రి ప్రకటన చేసి నాలుగు రోజులు గడుస్తున్నా రైతుల జాబితా విడుదల కాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇందుకు బలం చేకూర్చేలా సోమవారం వ్యవసాయ శాఖ నుంచి మరో రకంగా లెక్కలు విడుదల అయ్యాయి. 6,676 మంది రైతులకు రూ.82.19 కోట్లు విడుదల అయినట్లు మరో లెక్కల పుస్తకం విడుదల అయింది. దీంతో అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతోంది? మాఫీ అయితదా కాదా? అనే అనేక సందేహాలు రేకెత్తుతున్నాయి. తమ రుణం సంగతి ఏమైందని అనేక మంది రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

### లేని రుణం అంటగట్టారు



నా పేరున హసన్‌పర్తి ఎస్‌బీఐలో లక్షా 62వేల రుణం ఉంది. నా భార్య వనిత పేరు మీద 32వేల రుణం ఉంది. ఇద్దరివి కలిపి లక్షా 94వేలు మాత్రమే ఉంది. మూడో విడతలో నా రుణం మొత్తం మాఫీ అయితదనుకున్నా. ఆధార్‌కార్డుతో వ్యవసాయాధికారులను కలిసి చెక్ చేయిస్తే నా పేరిట రెండు లక్షల 35వేల రుణం ఉన్నట్లుగా చూపించింది. ఇదేంటని తెలుసుకుంటే నేను పదేళ్ల క్రితం డీసీసీ బ్యాంకులో రుణం తీసుకున్నాను. ఆ డబ్బులు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే మాఫీ అయినట్లు బ్యాంకు అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు మాత్రం డీసీసీ బ్యాంకులో రుణం ఉందని అధికారులు చెబుతున్నారు. పాత అప్పు పేరిట నాకు ఇప్పటికీ రుణమాఫీ చేయకపోవడం అన్యాయం.

– మ్యాక పాపిరెడ్డి, రైతు, సీతంపేట, హసన్‌పర్తి